వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 232
మంగళవారం | 19 మార్చి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

## నాయీ బ్రాహ్మణులకు అండగా ఉంటా

ఎన్నికల సమయంలో నా మీద చూపిన ప్రేమను మరువలేను

మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



8లో

# మోడీ జోష్





- బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం
- ఆకట్టుకున్న మల్కాజిగిరి రోడ్ షో
- బహిరంగ సభలు విజయవంతం
- మోడీ గ్యారెంటీకి ఆకర్షితులవుతున్న జనం

సార్వత్రిక ఎన్నికల నగరా మోగడమే ఆలస్యం.. భారతీయ జనతా పార్టీ రంగంలోకి దూకింది. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో మోడీ పర్యటన జోష్ నింపింది. ఏకకాలంలో రెండు రాష్ట్రాల్లో మోడీ సభలు విజయవంతం అయ్యాయి. మల్కాజిగిరిలో రోడ్ షోతో మొదలు, నాగర్ కర్నూలు, జగిత్యాలలో నిర్వహించిన భారీ బహిరంగ సభలకు జనం భారీగా తరలి వచ్చారు. అక్కడినుంచే ఎన్నికల శంఖారావం పూరించారు. మోడీ రాకతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అలాగే చేరికలను కూడా ప్రోత్సహిస్తోంది. ఇతర పార్టీల నుంచి వచ్చే వారితో ఆ పార్టీ కొంత బలం పుంజుకుంది. మోడీ గ్యారెంటీకి జనం ఆకర్షితులవుతున్నారు. ఎక్కడికి వెళ్లినా ఆయన పేరునే మార్మోగిస్తున్నారు. జైభారత్, జై శ్రీరామ్ నినాదాలు ఆకట్టుకుంటున్నాయి. ప్రజలు కూడా మోడీపట్ల సానుకూలతనే ప్రకటిస్తున్నారు. ఆయనకు అడుగడుగునా నీరాజనం పలుకుతున్నారు. ఆయనపై పూల వర్షం కురిపిస్తున్నారు. మోడీ చరిష్మాతో ఈ సారి రాష్ట్రంలో కనీసం పది స్థానాల్లో బీజేపీ విజయం సాధించాలని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్


వివరాలు 2లో..

## పార్టీ మారడం లేదు

- కేసీఆర్ సారథ్యంలోనే పనిచేస్తా..
- అసత్యపు ప్రచారాలను నమ్మొద్దు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
- ఆకురాలే కాలమన్న మాజీ ఎమ్మెల్యే వినయ్



8లో



8 లో..

## మహిమాన్విత క్షేత్రం కోటంచ

నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు షురూ

వరంగల్ వాయిస్ Evening Daily
మంగళవారం 19, మార్చి 2024
www.warangalvoice.net

# మోడీ జోష్

**బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం**
**ఆకట్టుకున్న మల్కాజిగిరి రోడ్ షో**
**బహిరంగ సభలు విజయవంతం**
**మోడీ గ్యారెంటీకి ఆకర్షితులవుతున్న జనం**


వరంగల్ వాయిస్, ఫైల్ ఫోటో..

**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశంలో ముచ్చటగా మూడో సారి అధికారంలోకి రావడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ అడుగులు వేస్తోంది. ఇంత కాలం ఉత్తరాధికే పరిమితమై బీజేపీ దక్షిణాధి రాష్ట్రాల్లో కూడా పాగా వేసేందుకు పావులు కదుపుతోంది. లోక్ సభలో 400 స్థానాలు దక్కించుకున్న ఏకైక అతి పెద్ద పార్టీగా కీర్తి గడించేందుకు పాటుపడుతోంది. అందుకు మోడీ చరిష్మాను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటోంది. అందులో భాగంగానే దేశ ప్రజల్లో మోడీ జోష్ నింపుతోంది. మోడీ గ్యారెంటీ పేరుతో జనాన్ని ఆకర్షిస్తున్నారు.

## మోడీ మేనియా..

స్థానికంగా బీజేపీకి ఎలాంటి బలం లేకున్నా మోడీ మేనియా ఉందనడంలో సందేహం లేదు. ఇకపోతే సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఆ పార్టీ తిరుగలేని ఆధిపత్యం సాధించింది. బీజేపీకి ప్రత్యామ్నాయం అంటూ తొడగొట్టిన పార్టీలన్నీ చతికిల పడ్డాయి. మోడీ, అమిత్ షాల వ్యూహం ముందు ఇప్పుడు ఎవరి వ్యూహం పనిచేయడం లేదు. ఈ క్రమంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో విపక్షాలు ఎలాంటి వ్యూహం అనుసరిస్తాయన్నదే ముఖ్యం. ఎందుకంటే మోడీ వ్యూహం ఇప్పటికే సిద్ధం అయి ఉంటుంది. అది ఏంటన్నది త్వరలో బయటకు రానుంది.

## ఉమ్మడి ప్రధానిపై పీఠముడి..

ఈ క్రమంలో విపక్షం నుంచి ఉమ్మడి ప్రధాని అభ్యర్థిగా ఎవరు అన్నది ఆసక్తిగా మారింది. కాంగ్రెస్‌తో కలసి ఉమ్మడి ప్రధాని అభ్యర్థిని ప్రకటించే విషయంలో ఏ ఒక్క పార్టీ కూడా ఇప్పటికీ ప్రయత్నాలు మొదలు పెట్టలేదు. ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటు చేస్తామని ప్రకటించిన కేసీఆర్ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో చతికిల పడ్డారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తరవాత అనూహ్యంగా బీహార్ సీఎం నితీశ్ కుమార్ మరోమారు ఎన్డీఏ గూటికి చేరడంతో ఇండియా కూటమి బలహీనపడింది. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం హయాంలో జరిగిన అవినీతిపైనా మోడీ విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో మరోసారి పీఠమెక్కడానికి బీజేపీ సిద్ధమవుతోంది.

## విపక్షాల ఐక్యతకు పరీక్ష..

విపక్షాల ఐక్యతకు ఇదో పరీక్ష. ప్రత్యామ్నాయ రాజకీయ వేదికకు ఇదే సరైన సమయం అయినా అది గట్టిగా నిలబడలేక తంటాలు పడుతోంది. ఎన్నికల్లో ఎన్‌డీఏకు గట్టి పోటీ ఇస్తారా లేదా అన్నది చూడాలి. ఇక్కడి నుంచే ఇక ఉమ్మడి ఎజెండాతో ముందుకు సాగితే సానుకూల అవకాశాలు ఉంటాయి. మోడీని ఎన్నికల్లో మాత్రమే ఎదరించకుండా..మోడీ విధానాలను ఎదరించేందుకు ఇక నిరంతరంగా శ్రమించాల్సిన బాధ్యతను తీసుకుంటే తప్ప ప్రజలు నమ్మరు. అందుకు ప్రాంతీయ పార్టీలు అనుసరించే వ్యూహం ఏంటన్నది మున్ముందు బయటపడనుంది.

## త్రిముఖ పోటీ..

లోక్‌సభ ఎన్నికలు తెలంగాణలోని మూడు ప్రధాన పార్టీలకూ విషమ పరీక్షగా ఉండబోతున్నాయి. దశాబ్దం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సుస్థిరంగా కొనసాగాలంటే ఆ పార్టీ కనీసం ఓ పది లోక్‌సభ సీట్లు గెలవగలగాలి. లేకుంటే కష్టమే కాగలదు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదగాలంటే ఇప్పుడు ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని కొట్టేయాలని చూస్తున్న భారతీయ జనతా పార్టీ, తన ఆకాంక్ష నెరవేరాలంటే కనీసం ఐదారు స్థానాలు గెలుచుకోవాలి. మూడు నెలల క్రితం అధికారాన్ని కోల్పోయిన భారత రాష్ట్ర సమితి విచిత్రమైన పరిస్థితిలోకి జారిపోయింది. లోక్‌సభ ఎన్నికల్లో కనీసం రెండు మూడు స్థానాల్కైనా గెలుచుకొని సగం పైగా స్థానాల్లో ద్వితీయ స్థానంలో నిలబడని పక్షంలో ఆ పార్టీ మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది. ప్రస్తుత అంచనాల ప్రకారం బీఆర్ ఎస్ కనీసం ఒకటి రెండు స్థానాల్కైనా గెలుస్తుందా అన్న ప్రశ్న రాజకీయ పరిశీలకుల నుంచి వినిపిస్తోంది. ఎందుకంటే ఆ పార్టీనుంచి బరిలోకి దిగేందుకు అభ్యర్థులు వెనుకడుగు వేస్తున్నారు. దక్షిణ తెలంగాణలోని కొన్ని స్థానాలలో ఆ పార్టీ ద్వితీయ స్థానానికే పరిమితం కావడం ఖాయంగా కనిపిస్తోంది.

## వలసలతో కారు బేజారు..

రాష్ట్రంలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యనే కేంద్రీకృతం అయిందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. మరోవైపు బీఆర్ఎస్ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్‌లో చేరుతున్నారు. అలాగే సిట్టింగ్ ఎంపీలు కొందరితో పాటు మాజీ ఎంపీలు సైతం పార్టీని వదిలి బీజేపీలో చేరుతున్నారు. ఎన్నికల వరకు ఎమ్మెల్యేలు అందరూ ఐక్యంగా పార్టీకి అండగా ఉంటారా? అన్న సందేహాలు కూడా మొదలయ్యాయి. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ముఖ్యులతో టచ్‌లోకి వెళ్లారు. దానం లాంటి వారు అడుగేశారు. కాంగ్రెస్ గేట్లు తెరిచిందని సీఎం రేవంత్ ప్రకటించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకొనే విషయంలో ఇంతకాలం విముఖంగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాజాగా మనసు మార్చుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రభుత్వం సుస్థిరంగా ఉండాలంటే పార్టీ బలాన్ని పెంచుకోవాల్సిన అవసరాన్ని ఆయన గుర్తించారు. గతంలో కేసీఆర్ చూపిన బాటలోనే రేవంత్ రెడ్డి పయనిస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ మోడీ జోష్ దేశ వ్యాప్తంగా వీస్తున్న ఈ తరుణంలో ఇతరులెవరూ బీజేపీకి దరిదాపుల్లోకి కూడా రారన్న ప్రచారం సాగుతోంది.




వరంగల్ వాయిస్, ఫైల్ ఫోటో..

# పరీక్షా కేంద్రాలను సందర్శించిన సీపీ




**వరంగల్ వాయిస్, క్రైం :** పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న పలు కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. హనుమకొండలోని మార్కజీ హై స్కూల్ లో పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తుతో పాటు పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలపై పోలీస్ కమిషనర్ ఆరా తీశారు. పరీక్షా కేంద్రాల పరిసరాలపై పోలీసులతో పాటు, ఇన్విజిలెటర్లు దృష్టి పెట్టాలని, సెక్షన్ 144 అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రజలు గుంపులు ఉండకుండా జాగ్రత్త పడాలన్నారు. అలాగే అనుమతులు లేకుండా సభలు సమావేశాలు నిర్వహించడం చేయరాదని, ముఖ్యంగా పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్షా కేంద్రాల పరిసరాలను నో సెల్ ఫోన్ జోన్ గా పరిగణలోనికి తీసుకుపోవడంతో పాటు పరీక్షా కేంద్రం పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలన్నారు. ముఖ్యంగా సీసీ కెమెరాల పనితీరుపై సంబందిత పరీక్షా కేంద్రం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేశించాలని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## మహేశ్వం చెక్ పోస్ట్ సందర్శన..

ఎన్నికల నిబంధనల అమలులో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను సీపీ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా నర్సంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మహేశ్వరం వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్ట్ ఏర్పాట్లతో పాటు, తనిఖీలు నిర్వహిస్తున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# మా అమ్మను కలిసేందుకు అనుమతించండి

## ఢిల్లీ కోర్టులో కవిత పిటిషన్



**వరంగల్ వాయిస్, ఢిల్లీ :** ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్నారు. ఈ క్రమంలో మా అమ్మను కలిసేందుకు అనుమతించండి అంటూ న్యాయస్థానాన్ని ఆమె అభ్యర్థించారు. తల్లితో పాటు కుమారులను కలుసుకునేందుకు కూడా అనుమతించాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ మేరకు రౌస్ అవెన్యూ కోర్టులో కవిత తరపు న్యాయవాదులు మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. కవిత అభ్యర్ధనకు న్యాయస్థానం అంగీకారం తెలిపింది. తల్లి శోభ, కుమారులు ఆదిత్య, ఆర్య, సోదరీమణులు అఖిల, సౌమ్య, వినుత, సోదరుడు ప్రశాంత్ రెడ్డిలను కలుసుకునేందుకు న్యాయస్థానాన్ని కవిత అనుమతి కోరారు. ఈ క్రమంలో తల్లీ, కుమారులు, కుటుంబ సభ్యులను కలిసేందుకు కవితను న్యాయస్థానం అనుమతించింది. కస్టడీలో ఉన్న ఏడు రోజుల్లో ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల మధ్య బంధువులను కలుసుకునేందుకు కవితకు న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఎక్కువ మందిని కలవడం వల్ల దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందని ఈరోజు కవిత తాజా పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. ఢిల్లీ మద్యం కేసులో తనను అక్రమంగా అరెస్టు చేశారంటూ కవిత సోమవారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సర్వోన్నత న్యాయస్థానంలో కేసు విచారణ జరుగుతుండగానే అరెస్ట్ చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. గతంలో విచారణ సందర్భంగా సమన్లు జారీ చేయబోమని కోర్టుకు ఈడీ తరపు న్యాయవాది చెప్పారని గుర్తు చేశారు. కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు భావించి, ఈడీపై తగిన చర్యలు తీసుకోవాలని కవిత తరఫున న్యాయవాది ఆన్‌లైన్ పిటిషన్ దాఖలు చేశారు.

## పది పరీక్షా కేంద్రాల పరిశీలన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాంటిస్సోరి హైస్కూల్, చైతన్య టెక్ స్కూల్ లో పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తుతో పాటు పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఎస్పీ పర్యవేక్షంచారు. పరీక్షలను పురస్కరించుకొని పరీక్షలు జరుగుతున్న పరీక్షా కేంద్రాల పరిసరాలపై పోలీసులతో పాటు, ఇన్విజిలెటర్లు దృష్టి పెట్టాలని, సెక్షన్ 144 అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రజలు గుంపులు ఉండకుండా జాగ్రత్త పడాలని, అలాగే అనుమతులు లేకుండా సభలు సమావేశాలు నిర్వహించడం చేయరాదన్నారు. ముఖ్యంగా పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్షా కేంద్రాల పరిసరాలను నో సెల్ ఫోన్ జోన్ గా పరిగణలోనికి తీసుకుపోవడంతో పాటు పరీక్షా కేంద్రం పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని తెలిపారు. ముఖ్యంగా సీసీ కెమెరాల పనితీరుపై సంబంధిత పరీక్షా కేంద్రం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తమ తమ ఇండ్లలోని చెత్తాచెదారాన్ని అక్కరకు రాని వస్తువులను కొందరు మురుగు కాలువలలో వేయడం వలన చెత్తాచెదారం పేరుకుపోయి మురుగునీరు నిలువ ఉండడం వలన దోమలు పుట్టుకొచ్చి ప్రజలకు హాని చేకూర్చుతోందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. డివిజన్ లోని ఉరుసు ప్రతాప్ నగర్ లో మురుగు కాల్వలలో ఉన్న చెత్త చెదారాన్ని పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించే శానిటేషన్ సిబ్బంది పనులను మంగళవారం కార్పొరేటర్ మరుపల్ల రవి పరిశీలించారు. ఆ ప్రాంత ప్రజలను ఉద్దేశించి కార్పోరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ చెత్తాచెదారాన్ని మురుగు కాలువలలో వేయకుండా మహానగర పాలక సంస్థ ద్వారా వచ్చు స్వచ్ఛ ఆటో సిబ్బందికి చెత్తాచెదారాన్ని అక్కరాన్ని వస్తువులను అప్పజెప్పాలన్నారు. మరుగుదొడ్లు లేని వారు వెంటనే నిర్మించుకోవాలని ప్రజలను కోరారు. మురుగు కాలువలలో మలేరియా సిబ్బందిచే దోమలు పుట్టుక రాకుండా రసాయనిక ద్రవాన్ని పిచికారి చేయించారు. హెల్త్ అసిస్టెంట్ శివకుమార్, జవాన్ ప్రశాంత ఉన్నారు

## ఆఫీసర్స్ క్లబ్‌లో సన్నాహక సమావేశం

### పాల్గొన్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశంలో తిరుగులేని పార్టీ బీజేపీకి తెలంగాణ ప్రజల మద్దతు ఉంటుందని మహబూబాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గతంలో పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న అభివృద్దే ఇప్పటికీ అదే అభివృద్ధి కనబడుతుందని ఎద్దేవా చేశారు. ఇంతకు ముందు ఉన్న నాయకులు అభివృద్ధి చేయకపోగా, రాష్ట్రంలో దోచుకున్న, దాచుకున్న కీర్తి వారికే దక్కుతుందని మండిపడ్డారు. అనంతరం ఆఫీసర్స్ క్లబ్ లో వారితో షటిల్ అడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ శాసనసభ్యుడు సీనియర్ నాయకులు మార్తినేని ధర్మారావు, సీనియర్ నాయకులు రాజేశ్వరరావు, అమరేందర్ రెడ్డి, డోర్నకల్ నియోజకవర్గ ఇంచార్జి లక్ష్మణ్ నాయక్, ఆఫీసర్స్ క్లబ్ కమిటీ సభ్యులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పలు డివిజన్ల నుంచి సుమారు 100 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు తాళ్లపల్లి రవీందర్ (జేకే ) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు మంగళవారం విశాల్ భవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయకపోవడం, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మొన్నటి ఎన్నికల వరకు ప్రజలను మోస పూరిత మాటలతో మభ్యపెడుతూ కాలం వెల్లదీశారని అన్నారు. పార్టీలో చేరిన కార్యకర్తలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాపాలన సాధ్యమని తెలిసి మంగళవారం పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి వేలుపుల జాన్ వెస్లీ, తాళ్లపల్లి చిన్న, గిరబోయిన శ్యామ్, పులిశేరు అరుణ్ కుమార్, పసునూరి మనోహర్, మంద సారయ్య, చింతల భిక్షపతి, అబ్రహం, చింతల మహేందర్, మహమ్మద్ ఇజాజ్, పి నరేష్, పసునూరి మున్నా, అంబాలా రాజు (ఆర్ఎంపీ డాక్టర్) పున్నం, ప్రసన్న, ప్రశాంత్, జగదీశ్, అవినాష్, మహేందర్, కిరణ్, రాజేష్, మహేష్, సతీష్ తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సుధాకర్, నెక్కొండ కిషన్, తాళ్లపల్లి మేరీ, అనుకోటి పున్నం పాల్గొన్నారు.

## ఘనంగా పోషణ పక్వాడ



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని ఉప్పరపల్లి గ్రామ అంగన్వాడి కేంద్రంలో మంగళవారం అంగన్వాడీ టీచర్ల ఉడుగుల రజిత ఆధ్వర్యంలో పోషక పక్వాడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన పోషణ ఆరోగ్య తెలంగాణ లక్ష్యంతో పోషక లోపం లేని గ్రామాలను తీర్చిదిద్దడం కోసం అంగన్వాడీల ద్వారా గర్భిణి స్త్రీలకు, చిన్నపిల్లలకు పౌష్టిక ఆహారం అందించడంలో అంగన్వాడి కేంద్రాలు ముందు భాగాన నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగాగర్భిణి స్త్రీలకు, చిన్న పిల్లలకు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. ఇంటిలో అనుకూలంగా అందుబాటులో ఉండే చిరుధాన్యాలను, ఆకుకూరలను, కూరగాయలను ప్రదర్శన నిర్వహించారు. వాటి ద్వారా వచ్చే పోషక విలువల గురించి వివరించారు. మూడు సంవత్సరాల నుంచిఐదు సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఆయాలు ఏ కట్టమ్మ, ఎం శారద, ఆశ వర్కర్లు మాడుగుల లత, ఆయేషా, దొమ్మటి రాజమణి, తల్లులు గర్భిణీ స్త్రీలు చల్ల పద్మ, అంజు, ప్రవళిక, కావటి, అరుణ, నిమ్మరమైన రమ్య, పిల్లలు పాల్గొన్నారు.

## శ్రీ రామ మూల మంత్ర హెూమం



**వరంగల్ వాయిస్, మడికొండ :** క్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన శ్రీ మెట్టుగుట్ట దేవస్థానములలో మంగళవారం శ్రీ రామచంద్ర స్వామి వారి జన్మనక్షత్రం పునర్వసు సందర్భంగా ఉదయం శ్రీ సీతారామచంద్ర స్వామివారికి పంచామృతాలచే సర్వాంగాభిషేకం నిర్వహించి అనంతరం యాగశాలలో శ్రీరామ మూల మంత్ర హెూమం నిర్వహించారు. తదుపరి శివాలయంలో శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి వారికి ప్రాతఃకాల రుద్రాభిషేకం నిర్వహించి అనంతరం భక్తులకి దర్శనం కల్పించి, అభిషేకాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి, శివాలయం ధర్మకర్తల మండలి చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు పరాశరం విష్ణువర్ధనాచార్యులు, రాగిచేడు అభిలాష్ శర్మ, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు బైరి రాజు, వస్కుల ఉమ, దండిగం శ్రీనివాస్, రొడ్డ దయాకర్, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ పరీక్షలు ఎక్కడ

### జిల్లాలోనే ఐసీటీసీలు లేకపోవడం శోచనీయం

### బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి భాస్కర వెంకటరమణ

**వరంగల్ వాయిస్, కాటారం:** సమాజాన్ని గడగడలాడిస్తున్న ఎయిడ్స్ మహమ్మారిని గుర్తించేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పరీక్ష కౌన్సిలింగ్ కేంద్రాలు లేకపోవడం శోచనీయమని మహాదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి భాస్కర వెంకటరమణ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మహాదేవపూర్ తో పాటు చిట్యాలలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా, వీటిలో హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ పరీక్ష, కౌన్సిలింగ్ కేంద్రాలు (ఐసీటీసీలు) గత 19 సంవత్సరాలుగా పనిచేస్తూ ఉండగా కేంద్ర ప్రభుత్వంలోని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రేషనలైజేషన్ పేరిట ఐసీటీసీ కేంద్రాలను ఎత్తివేయడం దారుణమైన విషయమని వెంకటరమణ ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్ఐవీ పరీక్ష ఎంతో అత్యవసరమని, ఆవశ్యకమని భావిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ జిల్లా కేంద్రంలోని వందపడకల మాతా శిశు జనరల్ ఆసుపత్రితో పాటు మెడికల్ కాలేజీలో కూడా ఐసీటీసీ లేని విషయాన్ని జాతీయ సంస్థలకు నివేదించకపోవడం జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. బహుశా తెలంగాణ రాష్ట్రంలోనే జిల్లా వ్యాప్తంగా మొత్తంగా ఐసీటీసీ కేంద్రాలు లేని జిల్లా ఏదంటే జయశంకర్ భూపాలపల్లి జిల్లాగానే చెప్పుకోవచ్చు అని విమర్శించారు. ఇదీలా ఉండగా ఇప్పటివరకు మహాదేవపూర్ ప్రాంతం తో పాటు చిట్యాల, భూపాలపల్లి ఆసుపత్రులలో ఐసీటీసీలు లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మహాదేవపూర్ కేంద్రంగా ఐసీటీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లయితే తెలంగాణ మహారాష్ట్ర, చత్తీస్ గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంత ప్రజలకు గిరిజన గూడాలాలకు ఉపయోగకరంగా ఉంటుందని ఆయన సూచించారు. అలాగే మహాదేవపూర్, చిట్యాల ఐసీటీసీలతో పాటు ఇతర ప్రాంతాలలో హెచ్ఐవీ పరీక్షలు చేయించుకుని ఎయిడ్స్ బారిన పడిన బాధితులు, ఈ ప్రాంతంలో సుమారుగా ఉన్నటువంటి వారికోసం ఏఆర్టీ మందులు మహాదేవపూర్ కేంద్రంలో అందుబాటులో ఉంచాలని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి భాస్కర వెంకటరమణ కోరారు. ఈ మేరకు ఆయన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లకు వినతి పత్రాలు సమర్పించినట్లు వెంకటరమణ విలేకరులకు వివరించారు.



# ప్రశాంత వాతావరణంలో పది పరీక్షలు

## కలెక్టర్ భవేష్ మిశ్రా



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జంగేడు ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షా సరళిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో పదవతరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని పరీక్షా కేంద్రంలో వైద్య శిబిరం, తాగునీరు, మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పరీక్షా కేంద్రంలో 210 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 209 హాజరయ్యారని తెలిపారు. వేసవి ఎండల దృష్ట్యా విద్యార్థులు ఏదేని అస్వస్థతకు గురైన తక్షణమే వైద్య సేవలు అందించేందుకు ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసులకు అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్షా పత్రాలు, జవాబు పత్రాల రవాణాలో పోలీస్ ఎస్కార్ట్ తో చేయాలన్నారు. జవాబు పత్రాలు తరలింపుకు తహసీల్దార్, ఎంపీడీఓల క్లోస్డ్ వాహనంలో తరలించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచీలు, కాలిక్యూలేటర్లు అనుమతించొద్దని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులతో పాటు, సిబ్బందిని నిశిత పరిశీలన తదుపరి తర్వాతనే అనుమతించాలని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3547 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు వ్రాస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 20 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, పరీక్షలు నిర్వహణ పర్యవేక్షణకు 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 20 మంది డిపార్ట్ మెంటల్ ఆఫీసర్లు, 20 మంది సిట్టింగ్ స్క్వాడ్లు, 240 మంది ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందని తెలిపారు. ముగ్గురు సెంటర్ కస్టోడియన్లు, ఇద్దరు రూట్ ఆఫీసర్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రామ్ కుమార్ పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**ములుగు, వరంగల్ వాయిస్ :** ములుగు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించడంతో పాటు విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాల ఏర్పాట్లను సైతం ఆమె పరిశీలించారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ 10వ తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో సెల్ ఫోన్ అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్ తీసుకెళ్లకుండా ప్రతి ఒక్కరినీ పకడ్బందీగా చెక్ చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. ఎండల దృష్ట్యా పరీక్షల కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎక్కడ పొరపాట్లకు తావివ్వకుండా నిబంధనల మేరకు పరీక్షల నిర్వహణ చేయాలన్నారు. పరీక్షా పత్రాలు, జవాబు పత్రాల రవాణా పోలీస్ ఎస్కార్ట్ తో చేయాలన్నారు. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, అన్ని భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 21 పరీక్షా కేంద్రాల్లో, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన మొత్తం 3088 మంది విద్యార్థులకు గాను 3081 మంది విద్యార్థులు హాజరయ్యారని, 7 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. 21 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 21 మంది శాఖాధికారులు, 2 ఫ్లయింగ్ స్క్వాడ్, 6 సిట్టింగ్ స్క్వాడ్, 200 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ప్రభుత్వ పరీక్షల సహాయ నియంత్రణ అధికారి అప్పని జయదేవ్, చీఫ్ సూపరింటెండెంట్ తిరుపతి, డీఓ రవీందర్, తదితరులు ఉన్నారు.

## మంచినీటి సమస్య తలెత్తకుండా చూస్తాం

### మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మంచినీటి సమస్య తలెత్తకుండా చూస్తామని మున్సిపల్ కమిషనర్ పి.శాంతి కుమార్ అన్నారు. మంగళవారం తొర్రూరు మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాలేరు రిజర్వాయర్ లో వాటర్ స్టోరేజ్ లేనందున మిషన్ భగీరథ వాటర్ తొర్రూరుపట్టణానికి తగినంతగా ఇవ్వలేక పోతున్నామని మాదిరిపురం ఫిల్టర్ బెడ్ అధికారులు తగు సూచనలు చేయడం జరిగిందన్నారు. ఆ సూచనల ప్రకారం తొర్రూరు మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ కు పట్టణంలో గల మంచినీళ్ల బావిని, చర్ల బావిని శుభ్రపరిచి, రిపేరు చేయించి తొర్రూర్ పట్టణ ప్రజలకు మంచినీటి సమస్యలు లేకుండా చూడవలసిందిగా ఆదేశించారు. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ రెండు బావులకు మరమ్మతులు చేయించడం జరిగిందన్నారు. ఈ రెండు బావుల్లో వాటర్ టెస్ట్ కు గాను మాదిరిపురం ఫిల్టర్ బెడ్ ల్యాబ్ కు పంపించడం జరిగిందన్నారు. అక్కడి అధికారులు వాటర్ టెస్టింగ్ చేసి రిపోర్టు సమర్పించారని, ఈ బావిలో వాటర్ ను కాచి చల్లార్చిన తర్వాతనే త్రాగాలని సూచించారని తెలిపారు. పట్టణ ప్రజలందరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని వృథా చేయరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రంజిత్, వాటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జీతాలు ఇవ్వడం లేదని ఉపాధ్యాయుల నిరసన




**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాస్ రోడ్డు కిట్స్ కాలేజీ ఎదురుగా "అక్షర ది ప్లానెట్ స్కూల్" లో ఉపాధ్యాయుల ఆందోళనకు దిగారు. జీతాలు ఇవ్వకపోవడంతో స్కూల్ కు తాళం వేసి ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. జీతాలు ఇవ్వడం లేదని పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీంతో యాజమాన్యం తీరుపై తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

## సీసీ రోడ్డు పనుల ప్రారంభం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** సీసీ రోడ్డు పనులను మంగళవారం పాపయ్య పేట ధర్మ తండాలో కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో ఎస్ఎఫ్ సీ నిధుల నుంచి సుమారు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ఈ మేరకు గ్రామంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దొంతి చొరవతో ప్రత్యేక నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేయడం ఎంతో సంతోషకరమని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ధర్మ తండా గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు భూక్య శంకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆశీస్సులతో మరిన్ని నిధులు తీసుకువచ్చి గ్రామ అభివృద్ధికి పని చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దేన రమేష్, తప్పేట రమేష్, ఎస్టీ సెల్ మండల కార్యదర్శి బోడ రవి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భూక్య భాస్కర్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అమీరొద్దీన్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, పాపయ్య పేట గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కంచ ప్రభాకర్, అమ్రు తండా గ్రామ పార్టీ అధ్యక్షులు అబ్బులు, బోడ రవి, మాజీ సర్పంచ్ బాలు నాయక్, హంస వినోద్, బిచ్చం, బాలు, రమేష్, మంగ్యా, శ్రీను, నర్సింహా, నర్సు, బాలు, ప్రవీణ్, శ్రీను, వాల్ సింగ్, జీవన్, నర్సు, జగ్గు, పంతులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖను కలిసిన జంగా



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గా నియమితులైన జంగా రాఘవ రెడ్డి మంగళవారం హైదరాబాద్ లో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ జంగా రాఘవ రెడ్డిని అభినందించారు.

## వేం నరేందర్ రెడ్డిని కలిసిన కుడా చైర్మన్ ఇనగాల



**వరంగల్ వాయిస్, పరకాల :** వరంగల్ సీనియర్ నేత, పరకాల నియోజకవర్గం ఇంచార్జి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నూతనంగా "కుడా చైర్మన్" గా నియమితులైన సందర్భంగా మంగళవారంప్రభుత్వ ప్రధాన సలహాదారు(సీఎం ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

## ఎమ్మార్పీఎస్ వర్ధన్నపేట నియోజకవర్గం అధ్యక్షుడిగా కందిక సాంబరాజు మాదిగ



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** అయినవోలు మండలం పెరిమల్లెగూడెం గ్రామానికి చెందిన కందిక సాంబరాజు మాదిగను వర్ధన్నపేట నియోజవర్గం అధ్యక్షుడిగా ఎమ్మార్పీఎస్, ఎంపీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బీఎన్ రమేష్ కుమార్ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కల వెంకట స్వామి మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్ పద్మారావు నగర్ కాలనీ జాతీయ కార్యాలయంలో కందిక సాంబరాజు మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రం జారీ చేశారన్నారు. ఈ సందర్భంగా సాంబరాజు మాదిగ మాట్లాడుతూ నాపై నమ్మకం తో ఈ కీలకమైన బాధ్యతలు అప్పగించినందుకు నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఒక్క గ్రామం నుంచి నూతన కమిటీలో వేయడం జరుగుతుందన్నారు. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ అంతిమ లక్ష్యం కోసం, సాధనకు ముందుకు సాగుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల విల్సన్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు గదుల కుమార్ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటికాయల చిరంజీవి మాదిగ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి టి సంపత్ మాదిగ, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తక్కలపల్లి రాజు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

## రామప్పలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్పలో మంగళవారం ములుగు మండలం జంగాలపల్లి ప్రభుత్వ పాఠశాలలో 2006-07 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల జీవితంలో గడిపిన రోజులను మరోసారి గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రస్తుత జీవితంలో అనుభవించే బాధలు, బాధ్యతలు, కష్టాలు, సుఖాలను సైతం చెప్పుకున్నారు. అలాగే ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు అనేకసార్లు జరుపుకోవాలని నిర్ణయించుకొని రోజంతా రామప్ప పరిసరాల్లో సందడి చేశారు. అంతకుముందు రామప్ప దేవాలయంలో రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అచ్చునూరి కిషన్, మేకల వంశీ, బురం వెంకటేష్, సోమల్ల మహేష్, మేకల అశోక్, రేగుల బాషా, రేగుల సాయి కిరణ్, లోకుల ప్రమోద్, వైనాల శ్రీనివాస్, రేణికుంట్ల శ్రీమాన్, గుండె రాజేష్, మహేష్, రాయబారపు కృష్ణ, భావన్, తులసీ రాం, సురేష్, రోజా, కవిత, మహాలక్ష్మి, లలితా, రాధిక, సుమలత, స్వాతి, సృజన తదితరులు పాల్గొన్నారు.

## పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం అని వారి ఆశయాలను కొనసాగించాలని సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ అన్నారు. మంగళవారం రఘునాథపల్లి మండల సీపీఎం ఆఫీసులో మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతిని పురస్కరించుకొని సీపీఎం ఆధ్వర్యంలో స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆమె ముఖ్య భూమిక పోషించారన్నారు. దున్నేవారికి భూమి కావాలని, నైజాం నవాబు గద్దె దిగాలని సాగిన మహోత్తర సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన ఉద్యమమన్నారు. సాయుధ పోరాట ఫలితంగా మూడువేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయని, 4000 మంది కమ్యూనిస్టులు వీరమరణం పొందారని, 10 లక్షల ఎకరాల భూములు పేదలకు పంపిణీ చేయబడిందన్నారు. భూస్వామ్య వర్గంలో పుట్టిన పీడిత వర్గాల కోసం తుది శ్వాస వరకు పనిచేశారని. రెండు పర్యాలు ఎమ్మెల్యేగా గెలిచి నిత్యం ప్రజల కోసం గల మెత్తరన్నారు. ఎర్రజెండా ఊపిరిగా పోరాటమే ఆయుధంగా సాగిన పోరాటంలో మల్లు స్వరాజ్యం కీలక పాత్ర పోషించారని తెలిపారు. నేటి తరానికి మల్లు స్వరాజ్యం ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కడారి ఆంజనేయులు, సాగ సాంబరాజు, కడారి యాదగిరి, ఎండీ బాషా, వెంకటయ్య పాల్గొన్నారు.

## తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా సారంగపాణి



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** హైదరాబాద్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రజక సమన్వయ సంఘాల సమితి ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రజక సంఘాలు కలిసి ఒక సమితిగా ఏర్పడ్డాయి. కాగా, తెలంగాణ రజక సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర వైస్ చైర్మన్ గా తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన వడ్డేపల్లి సారంగపాణి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైస్ చైర్మన్ వడ్డేపల్లి సారంగపాణి మాట్లాడుతూ రజక జాతి హక్కుల కోసం నిరంతరం పోరాడుతానని పేర్కొన్నారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్ బస్వరాజ్ శంకర్, బీజేపీ రజక సెల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కొన్నే సంపత్, సమన్వయ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాలాపూర్ బాలరాజు, సమన్వయ కమిటీ రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ దుబ్బాక రమేష్, రజక సంఘాల సమన్వయ కమిటీ చీఫ్ అడ్వైజర్ కోట్ల శ్రీనివాస్, ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు జయరాం, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి, సమన్వయ సమితి మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు చిట్యాల ఐలమ్మ ముని మనవరాలు శ్వేత సంపత్, చిట్యాల ఐలమ్మ మనుమడు రామచంద్రం, మురళి, కుమారస్వామి, కోడూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కవులు-గాయకులు మార్గ నిర్దేశకులుగా ఉండాలి



### ఉద్యమకారుడు కర్రా యాదవ రెడ్డి పిలుపు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పుస్కరించుకొని నిన్న ప్రజాకళల వేదిక ఆధ్వర్యంలో జరిగిన కవి -గాయక సమ్మేళనానికి ఆత్మీయ అతిథిగా హాజరైన రైల్వే విశ్రాంత నాయకుడు కర్ర యాదవ రెడ్డి గారు పిలుపునిచ్చారు. వరంగల్ రైల్వే స్టేషన్ రోడ్డులోని బాపూజీ హాల్ లో జరిగిన కవి గాయక సమ్మేళనం కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా జరిగింది. శ్రామిక మహిళా దినత్సవం సందర్భంగా మహిళా చైతన్యం గురించి కవులు-గాయకులు తమ కవితలను పాటలను వినిపించారు. ప్రజా కళల వేదిక నాయకులు రాజేష్ ఖన్నా అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆత్మీయ అతిథిగా హాజరైన కర్ర యాదవ రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని మూఢ నమ్మకాలను, రుగ్మతలను ఎత్తి చూపి వాటిపై ప్రజలను చైతన్యం చేసి తద్వారా వాటి నిర్మూలనకు కృషి చేసి సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి రచనలకు గాయకులకు ఉన్నదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ ఆకాంక్షను పల్లె పల్లెకు విస్తరించడానికి కారణం కవులు గాయకులేనని చెప్పుకొచ్చారు. నిజాన్ని నిర్భయంగా రాస్తున్న రచయితలపై జరుగుతున్న దాడులు, హింసను ఆయన ఖండించారు. ప్రస్తుత పరిస్థితి కొంత పర్వాలేదని రానున్న రోజుల్లో మన రాత, పాట, మాటపై నిర్బంధం పెరిగిన ఆశ్చర్య పొనవసరం లేదన్నారు. పరిస్థితులు ఎలా ఉన్నా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. నిర్బంధాలు, అణిచివేతకు వ్యతిరేకంగా కవులు, కళాకారులు ప్రజల వైపు నిలబడాలని కోరారు. ఉన్నతమైన సమాజం ఆవిష్కృతం చేయడం కోసం నిలబడాలని సభలో స్ఫూర్తి దాయకంగా ఉపన్యసించారు. అనంతరం పోస్టల్ డిపార్ట్మెంట్ జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు, బీసీ టీచర్స్ జిల్లా నాయకులు సాంబమూర్తి, ఎస్సీ, ఎస్టీ రైల్వే డివిజన్ నాయకులు కుర్మపెల్లి రవీందర్ లు మాట్లాడుతూ కవులు కళాకరులందరికి శుభాకాంక్షలు తెలియ జేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన కవయిత్రి ఉదయశ్రీ ప్రభాకర్, కొమ్మల సంధ్య మాట్లాడుతూ మాతృ స్వామ్య వ్యవస్థను బలోపేతం చేసినప్పుడే మహిళలకు సమ న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ డిపార్ట్ మెంట్ హెడ్ డా. వీరాస్వామి, కళా రాజేశ్వర్ రావ్, ఆర్ట్స్ కాలేజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. చింతం ప్రవీణ్ కుమార్ పాల్గొనగా సుమారు 50 మంది కవులు కళాకారులు పాల్గొని తమ కవితలను పాటలను వినిపించారు.

## కారు ఓనర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా బాదం ప్రవీణ్



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ గార్డెన్ లో సమ్మక్క సారక్క కారు ఓనర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మేకల సంజీవ ఆధ్వర్యంలో మంగళవారం కారు ఓనర్స్ సమావేశం నిర్వహించారు . దీనికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాదం ప్రవీణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు అందరూ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా బాదం ప్రవీణ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బాదం ప్రవీణ్ మాట్లాడుతూ ..నాపై నమ్మకంతో జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. మీ కష్ట సుఖాలలో తోడుంటు ప్రతిక్షణం మీ తోడు నీడగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బొమ్మగాని భాస్కర్, ప్రధాన కార్యదర్శి లోకు రాజేష్, కార్యదర్శి ఉప్పుల రాజు, జాయింట్ సెక్రెటరీ మాట్లా బద్రి, ముఖ్య సలహాదారులు అఫ్రోజ్ ఖాన్, మీడియా ఇంచార్జి గుగ్గిళ్ల సుజన్, కమిటీ సభ్యులు, బండ సురేష్, రమేష్, కోమల్ రెడ్డి, అజ్మీరా రామ్ సింగ్, అజ్మీరా కిషోర్ నాయక్, రాజేందర్, నన్నబోయిన రాజేందర్, పొడిచెట్టి రాజేందర్, మూసినపల్లి శ్రావణ్, తరుణ్, రమేష్, కిరణ్, క్రాంతి కుమార్, పిట్టల గిరి, కుమారస్వామి, రమేష్ పాల్గొన్నారు.

## సిమెంట్ బెంచీల బహూకరణ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలకు స్థానిక మాజీ సర్పంచ్ కందగట్ల రవి తన తండ్రి కందగట్ల సమ్మయ్య స్మారకార్థం 12వేల విలువ కలిగిన 4 సిమెంట్ బెంచీలను మంగళవారం బహూకరించారు. పాఠశాలలో ప్రతినెల రెండవ ఆదివారం పేరెంట్స్ విజిటింగ్ సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూర్చోవడానికి పడుతున్న ఇబ్బందులను గమనించిన స్థానిక ప్రిన్సిపాల్ మోతే రాజ్ కుమార్ సిమెంట్ బెంచీల విషయమై మాజీ సర్పంచ్ కందగట్ల రవి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన రవి తన తండ్రి స్మారకార్థం 4 బెంచీలను పాఠశాలకు అందజేశారు. మాజీ సర్పంచ్ రవికి ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ ఎంపీటీసీ వినుకొండ శంకరాచారి, వల్పదాసు సదాశివుడు, గాజుల రవి, కొత్తపల్లి రవి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని రాజుపల్లి గ్రామానికి చెందిన ఆవుల దిలీప్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలుసుకున్న శ్రీ మహేశ్వర మున్నూరు కాపు సంఘం సభ్యులు మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. దిలీప్ కుటుంబాన్ని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, సంఘం తరఫున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. తక్షణ సహాయం కింద రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు.

## హనుమంతరావును కలిసిన అర్చక ఉద్యోగ జేఏసీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ గా నియమించబడ్డ హనుమంతరావును మంగళవారం అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ, రాష్ట్ర కన్వీనర్ పరాశరం రవీంద్ర చారి, ప్రచార కార్యదర్శి రిపుంజయ శర్మ కలిసి వేద ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలు అందజేశారు.

# మల్లు స్వరాజ్యం జీవితం ఆదర్శనీయం

## ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి రత్న మాల



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లుస్వరాజ్యం జీవితం ఆదర్శనీయమని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి రత్న మాల అన్నారు. రజాకార్లను తరిమి కొట్టి, దొరలను గడుల్లో బంధించి, అయ్యా నీ బాంచన్ కాల్ మొక్కుతా దొర అనే సంస్కృతిని, వెట్టి చాకిరికి విముక్తి చేసిన గొప్ప వ్యక్తి మల్లు స్వరాజ్యం అని కొనియాడారు. రైతులను, భూమిలేని పేదలను అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచిన కామ్రేడ్ మల్లు స్వరాజ్యం అందరికీ ఆదర్శమన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం రజాకార్లను ఎదిరించి తుపాకి చేతబట్టి వీరోచితంగా పోరాడిన మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతి కరీమాబాద్ మల్లు స్వరాజ్యం నగర్ లో జరిగింది. ఈ వర్ధంతి సభకు ముందు వీరనారి మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం జరిగిన సభకు ఏరియా అధ్యక్షుడు అప్పాజీ వాణి అధ్యక్షత వహించగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాజాకార్ గుండెల్లో సింహ స్వప్నంగా నిలిచిన తెలంగాణ సాయుధ పోరాట యోధులు మల్లు స్వరాజ్యం వీరోచిత పోరాటం అందరికీ ఆదర్శం అన్నారు.

# మెట్టు సాయిని కలిసిన రాజేష్ ఖన్నా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** హైదరాబాద్ గాంధీ భవన్ లో తెలంగాణ రాష్ట్ర మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ గా నియామకమైన మెట్టు సాయి కుమార్ గంగపుత్రను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి, వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి, వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరీ అందించారు. అనంతరం రాజేష్ ఖన్నా మాట్లాడుతూ సీఎం ఏనుముల రేవంత్ రెడ్డికి తెలంగాణ గంగపుత్ర సంఘం తరుపున ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో సంప్రదాయ మత్యకార గంగపుత్రులకు మాత్రమే మత్య పారిశ్రామిక సహకార సంఘాలలో సభ్యత్వాలు కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఉత్తర్వులు వచ్చే విధంగా మెట్టు సాయి కుమార్ గంగపుత్ర కృషి చేయాలని కోరారు. నిరుపేద గంగపుత్రుల అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# పకడ్బందీగా పది పరీక్షల నిర్వహణ

## కలెక్టర్ సిక్తా పట్నాయక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని రెడ్డికాలనీలోని బాసిత్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మంగళవారం ఉదయం తనిఖీ చేశారు. పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ పరీక్ష కేంద్రంలో ఎంతమంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, ఎంతమంది గైర్హాజరయ్యారనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు.

# మున్సిపల్ కమిషనర్ అశ్వినీ తానాజీని కలిసిన వడుప్సా వరంగల్ జిల్లా కమిటీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వడుప్సా (ట్రస్మా) వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో వరంగల్ మున్సిపల్ కమిషనర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అశ్వినీ తానాజీ వాకడే ను జిల్లా కమిటీ, జోన్ కమిటీల అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిసి బొకే,మెమోంటో ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వడుప్సా (ట్రస్మా) వరంగల్ జిల్లా అధ్యక్షుడు అంకటి వీరస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లా రవి, జిల్లా కోశాధికారి ఠాగూర్ జ్ఞానేశ్వర్ సింగ్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఆడెపు శ్యామ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆడెపు వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు నాగపూరి కిరణ్ కుమార్, కన్వీనర్ వన్నాలగోవిందరాజులు, వడుప్సా వరంగల్ జోన్ అధ్యక్షుడు కూచన క్రాంతి కుమార్, కోశాధికారి కూరపాటి మోహన్, ఖిలా వరంగల్ జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్, ప్రధాన కార్యదర్శి దాసి సతీష్ మూర్తి, జిల్లా సలహాదారుడు కోడెం శ్రీధర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ముల్క శరత్ బాబు, వడిచర్ల. ప్రసాద్, తదితరులు కలిసి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎన్పీడీసీఎల్ సీఎండీ ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, జనగామ :** ఖిలా షాపూర్ సెక్షన్ లో ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించటానికి సిబ్బందికి అధికారులకు మార్గ నిర్దేశం చేశారు. పలు సమస్యలపై వారితో చర్చించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ వేణుమాధవ్, జనగామ డీఈలు, ఏడీఈలు, ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

# అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** అనుమానాస్పద లావాదేవీలను బ్యాంకర్లు గుర్తించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ మినీ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ జిల్లా స్థాయిలో బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యాభై వేల నుంచి పది లక్షల మధ్య డబ్బుల లావాదేవీలు జరిగితే కచ్చితంగా రశీదు ఉండాలని పేర్కొన్నారు. రూ.10 లక్షల పైన లావాదేవీలు ఉంటే ఆదాయ పన్ను శాఖ పరిధిలోకి వెళ్తుందని చెప్పారు. జిల్లాలో ఏటీఎంల్లో డబ్బులు నింపేందుకు వచ్చే సెక్యూరిటీ వ్యాన్ లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఏజెన్సీలు పెద్ద మొత్తంలో డబ్బులు తరలించాలంటే తెలంగాణ సీఈఓ నుంచి అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. లాకర్స్ లో గోల్డ్ ను పర్యవేక్షించి, క్యాష్ జెనరేట్ చేయడానికి క్యూఆర్ కోడ్ ను ఉపయోగించాలని, వెహికిల్ నంబర్లను తనిఖీ చేయాలని వివరించారు. అలాగే ప్రతి రోజూ క్యాష్ డిపాజిట్ వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. అంతకుముందు కలెక్టరేట్ ప్రధాన సమావేశం మందిరంలో డిప్యూటీ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో లతో జిల్లా ఎన్నికల అధికారి, అద్వైత్ కుమార్ సింగ్ పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్, ఎన్నికల విధులలో వివిధ ఎమర్జెన్సీ డిపార్ట్ మెంట్ల ప్రాముఖ్యత తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్ రాముతో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, ఎల్డీఎం ఆర్. సత్యనారాయణ మూర్తి ,బ్యాంకర్లు, ఎలక్షన్ సూపర్డెంట్ పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడీలో పిల్లలకు సరైన పౌష్టిక ఆహారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ హౌసింగ్ బోర్డ్, శాంతినగర్ అంగన్వాడీ కేంద్రాల పరిధిలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని సూపర్ వైజర్ కవిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు, తల్లిదండ్రులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. అలాగే బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం పట్ల తల్లులకు దిశా నిర్దేశం చేశారు. గర్భిణీలు బాలింతలు చిరుధాన్యాలతో పాటు ఆకుకూరలు, రకరకాల కూరగాయలు, పండ్లు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం సభ్యురాలు స్వర్ణలత మహిళలకు లింగ వివక్షత గురించి వివరించారు.సఖి వన్ స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపుల నుంచి విముక్తి పొందేలా సఖి వన్ స్టాప్ సెంటర్లు వినియోగించుకోవాలని సూచించారు. అంగన్వాడీ టీచర్లు సరస్వతి, రమా మాట్లాడుతూ అంగన్వాడీల ద్వారా గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు సరియైన పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. పిల్లల ఎదుగుదలకు అంగన్వాడీలు తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. పోషణ పక్వాడాలో భాగంగా ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సఖి సెంటర్ కేస్ వర్కర్ వినీల, అంగన్వాడీ హెల్పర్స్, ఆశాలు, తల్లులు పాల్గొన్నారు.



# మహేశ్‌తో త్వరలోనే షూటింగ్ ప్రారంభం

## జపాన్ వెళ్లిన సందర్భంలో జక్కన్న వెల్లడి

రాజమౌళి–మహేశ్‌బాబు కాంబినేషన్‌లో రానున్న సినిమాకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. ఇటీవల జపాన్ వెళ్లిన దర్శకుడు రాజమౌళి స్థానిక మీడియాతో మాట్లాడుతూ మహేశ్ బాబుతో సినిమా చేస్తున్నా. ఆయన మంచి నటుడు. చాలా అందంగా ఉంటారు. మీలో కొందరికి ఆయన గురించి తెలిసే ఉంటుంది. ఈ చిత్రానికి సంబంధించి ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలో చిత్రీకరణను ప్రారంభిస్తాం. వేగంగా నిర్మాణం పూర్తి చేసి మహేశ్‌బాబును ఇక్కడికి తీసుకురావాలని భావిస్తున్నా అని వెల్లడించారు. రామ్‌చరణ్, జూనియర్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్'ను దర్శకుడు రాజమౌళి తెరకెక్కించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం రికార్డులు సృష్టించింది. దీనిలోని 'నాటు నాటు' పాట బెస్ట్ ఒరిజనల్ సాంగ్ కేటగిరీలో ఆస్కార్‌ను సొంతం చేసుకుంది. ఈ సినిమా జపాన్‌లో గతేడాది విడుదలైంది. ఇటీవల అక్కడి ప్రేక్షకులతో కలిసి ఈ చిత్రాన్ని వీక్షించేందుకు రాజమౌళి జపాన్ వెళ్లారు. వారి అభిమానాన్ని ప్రశంసిస్తూ ఎక్స్‌లో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. జపాన్‌వాసులు 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రాన్ని ఎంతగానో ఆదరిస్తున్నారు. అక్కడి ప్రజలు తమకు ఇష్టమైనవారికి 'ఆర్గామి క్రేన్స్'ను బహూకరించడం సంప్రదాయం. ఈ చిత్రాన్ని వీక్షించిన 83 ఏళ్ల వృద్ధురాలు నాకు దానిని ఆప్యాయంగా ఇచ్చారు. అందుకోసం థియేటర్ బయట ఆమె కొన్ని గంటలు ఎదురుచూశారు. వారి అభిమానానికి కృతజ్ఞతలు అని రాజమౌళి పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అవుతోన్నాయి.





# మంచు లక్ష్మి ఫాంటసీ మూవీ ఆదిపర్వం

మంచు లక్ష్మీ ప్రధాన పాత్రలో నటించిన సోషియో ఫాంటసీ మల్టీ లింగ్యుల్ ఫిలిం ఆదిపర్వం చిత్రానికి సంజీవ్ మేగోటి దర్శకుడు. ఈ చిత్రం 1974 నుంచి 1992 మధ్య జరిగే పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కింది. సోమవారం ఐదు భాషల్లో ట్రైలర్ విడుదల చేశారు. అతిధులంతా సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. లక్ష్మీ మంచు మాట్లాడుతూ.. 'నాకు సంజీవ్ గారు కథ చెప్పినప్పుడు ఇంత పెద్ద సినిమా తక్కువ సమయంలో ఎలా చేస్తారని అనుకున్నా. పోస్టర్ చూస్తుంటే నేను ఇన్ని క్యారెక్టర్లు చేశానా అనిపిస్తుంది. నవ రసాలు, అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయి. అందరికీ ఈ సినిమా నచ్చుతుంది. మా దర్శకుడు చాలా స్వీట్ పర్సన్. మా నిర్మాతలు కోరుకున్న దాని కంటే ఎక్కువ విజయం సాధించాలని కోరుతున్నా' అని అన్నారు. ఈ మూవీలో మంచు లక్ష్మీ గారి విశ్వరూపం చూస్తామని.. ఆదిత్య ఓం గారిని కొత్త పాత్రలో చూస్తారన్నారు. ఎస్తర్ కీలక పాత్ర చేశారన్నారు.

# జోరు మీదున్న కియారా..

ఇప్పుడు బాలీవుడ్ లో అగ్ర నటీమణుల్లో స్థానం సంపాదించడానికి ప్రయత్నం చేస్తున్న నటీమణుల్లో కియారా అద్వానీ ఒకరు. రామ్ చరణ్ పక్కన 'గేమ్ చెంజర్' సినిమాలో కథానాయికగా నటిస్తోంది. శంకర్ దర్శకుడు, దిల్ రాజు నిర్మాత. ఈ సినిమా ఒక్క తెలుగులోనే కాకుండా, మిగతా భాషల్లో కూడా విడుదలయ్యే అవకాశాలు వున్నాయి. ఈ సినిమాతో పాటు ఇంకో పెద్ద సినిమా 'వార్ 2' లో కూడా కియారా కథానాయిక. గతేడాది ఫిబ్రవరి 7 తనతో ప్రేమలో వున్న సహచర నటుడు సిద్దార్థ్ మల్హోత్రా ని వివాహం చేసుకుంది కియారా అద్వానీ. తెలుగులో 'భరత్ అనే నేను' సినిమాతో మహేష్ బాబు పక్కన ఆరంగేట్రం చేసింది. ఆ తరువాత 'వినయ విధేయ రామ' అనే ఇంకో తెలుగు సినిమాలో నటించింది, ఇందులో రామ్ చరణ్ కథానాయకుడు. కియారా కి 'భరత్ అనే నేను' పెద్ద బ్రేక్ ఇచ్చిన సినిమా. తెలుగు సినిమా విడుదల సమయంలోనే 'లస్ట్ స్టోరీస్' అనే ఒక వెబ్ సినిమాలో ఒక బోల్డ్ పాత్రలో నటించి, అందరి దృష్టి ఆకర్షించింది. తెలుగులో పెద్ద విజయం సాధించిన 'అర్జున్ రెడ్డి' సినిమాని హిందీలో తెలుగు దర్శకుడు సందీప్ వంగా 'కబీర్ సింగ్' పేరుతో అర్జున్ కపూర్ కథానాయకుడిగా రీమేక్ చేశారు. అందులో కియారా అద్వానీ కథానాయికగా నటించింది. హిందీలో కూడా ఇది పెద్ద విజయం సాధించింది. హిందీలో తన ప్రియుడు సిద్దార్థ్ మల్హోత్రా పక్కన నటించిన యుద్ధ నేపథ్యంలో వచ్చిన సినిమా 'షేర్ షా'. ఇది నేరుగా అమెజాన్ ప్రైమ్ వీడియో లో విడుదలైంది. ఈ సినిమా అటు విమర్శకుల ప్రశంశలు, ఇటు ప్రేక్షకుల మన్ననలు పొందింది. 2021లో వచ్చిన ఈ సినిమా తరువాత కియారా సినిమాలు అంతగా బాక్స్ ఆఫీస్ దగ్గర ప్రభావం చూపలేదని చెప్పాలి. కియారా ఇప్పుడు 'గేమ్ చేంజర్' సినిమాపై చాలా అసలు పెట్టుకున్నట్టు కనపడుతోంది. ఎందుకంటే ఇప్పుడు ఆమె చేతిలో ఈ ఒక్క తెలుగు సినిమానే వుంది. ఇది హిందీలో కూడా విడుదలవుతుంది అని అనుకుంటున్నారు. ఈ సినిమా విడుదల తరువాత ఆమె 'వార్ 2' షూటింగ్ లో పాల్గొంటారు.



# మంచి సింగర్

అంబాజీపేట మ్యారేజి బ్యాండు' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయం అయిన తెలుగమ్మాయి శివాని నాగరం. సుహాస్ హీరోగా దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న రిలీజై మంచి విజయం దక్కించుకుంది. ఈ సినిమాలో హీరోయిన్ గా నటించిన శివాని తనదైన నటనతో..క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ తో ఆడియన్స్ మనసులని దోచేసింది. అయితే ఈ అమ్మడికి నటనలోనే కాదు..సింగర్‌గా కూడా తన సినిమా ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. లేటెస్ట్‌గా శివాని నాగరం సింగర్ గా అవతారమెత్తింది. ఆరంభం అనే సినిమాలో శివాని ఓ బ్యూటిఫుల్ లవ్ సాంగ్ పాడింది. 'అమాయకంగా హడావుడేమి లేక..తార చేరుకుందా ఇలా. అయోమయంగా తలాడించులాగ, నేల మారుతుందే ఎలా.. అంటూ మంచి లవ్ ఫీల్ తో ఓ మంచి కంపోజిషన్ తో సాగుతుందీ ఈ పాట. నిజానికి ఈ పాటకు మాత్రం శివాని నాగరం వాయిస్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచిందిని చెప్పొచ్చు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన ఈ పాట చాలా వినసొంపుగా ఉండటంతో పాటు లిరికల్ వీడియోలో శివాని నాగారం ఇచ్చిన పెర్ఫార్మన్స్ క్యూట్ గా తనవైపు తిప్పుకునేలా ఉంది. ఇక టాలీవుడ్ లో హీరోయిన్స్ గా రాణిస్తూనే..సింగర్స్ గా మారిన వాళ్ళు చాలానే ఉన్నారు. అందులో నిత్యామీనన్, శ్రుతి హాసన్, ఎన్టీఆర్, తమిళ హీరో శింబు, సిద్దార్థ్ సహా ఎంతోమంది అదిరిపోయే పాటలు పాడారు. మరి న్యూ టాలెంటెడ్ శివాని హీరోయిన్ గా..సింగర్ గా ముందు ముందు ఎలా ఆకట్టుకుంటుందో చూడాలి. ఆరంభం సినిమా విషయానికి వస్తే..మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ కీ రోల్స్ ప్లే చేస్తున్న మూవీ ఆరంభం. ఈ సినిమాను ఏవీటీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అభిషేక్ వీటీ నిర్మిస్తున్నారు.

# మహిమాన్విత క్షేత్రం కోటంచ

## నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు షురూ



**వరంగల్ వాయిస్, రేగొండ :** ఉమ్మడి రేగొండ మండలంలోని కొడవటంచ (కోటంచ) గ్రామంలో వెలిసిన సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం మొదటిరోజు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారమై వెలిసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి ఉదయం అభిషేకం, సూర్య వాహన సేవపై కొలువుదీరి మాడవీధుల్లో సూర్య మండలం మధ్యనున్న నారాయణమూర్తి నేనేనని భక్తులకు బోధిస్తూ స్వామివారు దర్శనమిచ్చాడు. ఈ అపురూప ఘట్టాన్ని వీక్షించిన భక్తులు తన్మయిం చెందారు. సాయంత్రం పుట్ట బంగారం సేవ, శేషవాహన సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆలయ అధికారులు ఎంతో వైభవంగా చేశారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు తరలి వస్తున్న భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు చేపట్టారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయానికి ప్రత్యేక లేజర్ లైటింగ్ లను అమర్చారు. ఈ కార్యక్రమంలో ఫెస్టివల్ కమిటీ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, కార్యనిర్వహణ అధికారి బిల్ల శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ కొమురాజు రవి, ఆలయ ప్రధాన అర్చకులు బుచ్చమాచార్యులు, కనుకుంట్ల దేవేందర్ రావు, ఆలయ సిబ్బంది సొన్నాయుల సుధాకర్, గోరంట్ల శ్రావణ్, నాగుల సుదర్శన్, తదితరులు భక్తులు పాల్గొన్నారు.



# నాయీ బ్రాహ్మణులకు అండగా ఉంటా

### ఎన్నికల సమయంలో నా మీద చూపిన ప్రేమను మరువలేను

### మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నాయీ బ్రాహ్మణులకు నిత్యం అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ప్రకటించారు. వరంగల్ తూర్పు నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఎలకంటి సతీష్ అధ్యక్షతన నాయి బ్రాహ్మనులకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాకతీయ పరపతి సంఘం 2వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరయ్యారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి నరేందర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నాయి బ్రాహ్మణులు నా మీద చూపించిన ప్రేమను మరువలేనన్నారు. మీరు నాకోసం పడ్డ కష్టానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని ప్రకటించారు. అంతే కాకుండా నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి చాలా కృషి చేశానని, అంతే కాకుండా మీకోసం ఎంతవరకైనా కొట్లాడుతానన్నారు. రానున్న రోజుల్లో మంచి పరిణామాలు జరుగబోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్, వివిధ జిల్లాల సభ్యులు, వరంగల్ తూర్పు నాయి బ్రాహ్మణలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మంత్రిని కలిసిన గడ్డం సమ్మయ్య



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** పద్మశ్రీ పురస్కార గ్రహీత, చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య మంగళవారం అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గడ్డం సమ్మయ్యతో పాటు పలువురు చిందు యక్షగాన కళాకారులు ఈ కళ పై ఆధారపడి జీవనం సాగిస్తున్న కళాకారులకు చేయూతనివ్వాల్సిందిగా మంత్రికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా గ్రంథాలయాల సంస్థ రాష్ట్ర చైర్మన్ గా నియమితులైన ఎండి రియాజ్ మంత్రి కొండా సురేఖను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

# పార్టీ మారడం లేదు

### కేసీఆర్ సారథ్యంలోనే పనిచేస్తా..

### అసత్యపు ప్రచారాలను నమ్మొద్దు

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

### ఆకురాలే కాలమన్న మాజీ ఎమ్మెల్యే వినయ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేసీఆర్ సారథ్యంలో పార్టీ కోసం ఒక సైనికుడిగా పనిచేస్తానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారాలను ఆయన కొట్టిపారేశారు. తనకు పార్టీ మారే ఉద్దేశం లేదన్నారు. బీజేపీలోకి వెళ్తున్నట్లు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు. బీఆర్ఎస్ కార్యకర్తలను తప్పుదోవ పట్టించేందుకు ఇలా ప్రయత్నిస్తున్నారన్నారు. క్యాడర్ తప్పుడు ప్రచారాలను నమ్మొదంటూ ఎర్రబెల్లి సూచించారు. హన్మకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన వర్ధన్నపేట నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్ లతో కలిసి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడుతూ..ప్రజలే మార్పు కావాలని కోరుకున్నారు. ఇప్పుడు ఆ ప్రజలే బీఆర్ఎస్ ను ఓడించి తప్పు చేశామని అంటున్నారన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలన ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. డిసెంబర్ 9 తేదిన మా ప్రభుత్వం ఏర్పడగానే రుణమాఫీ చేస్తాం, రైతుబంధు వేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా రూ.2500 ఇస్తామని చెప్పి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలో ఇప్పటికి వరకు 2 పథకాలు మాత్రమే అమలు చేశారన్నారు. పార్లమెంటు ఎన్నికల వేళ ఉచిత కరెంటు, రూ.500 లకే గ్యాస్ అని చెప్పి ప్రజలను ఎన్నికలు అయిపోయిన వెంటనే ఈ స్కీమ్ లను ఎత్తేస్తారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన స్కీములను ఎందుకు అమలు చేయలేక పోతున్నారన్నారు. రేవంత్ రెడ్డి కి మొదటి నుంచి మాయమాటలు చెప్పడం అలవాటుగా మారిందన్నారు. కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోతున్నాయని, కరెంటు రావడం లేదని, తాగునీరు అందడం లేదని ఆరోపించారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.20 వేల పంట నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చిన పార్టీ తరుపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మా పార్టీ ఎప్పుడైనా ప్రజల పక్షాన నిలబడి కోట్లాడుతుందని ఆయన గుర్తు చేశారు.

బీఆర్ఎస్ నుంచి ఇతర పార్టీలకు వెళ్లే నాయకులపై బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ఫొటోతో గెలిచిన నాయకులు ఇప్పుడు పార్టీ మారుతున్నారని విమర్శించారు. పార్టీ మారిన నాయకులతో క్యాడర్ పోవట్లేదని చెప్పారు. పచ్చని చెట్టుకు ఎండిపోయిన ఆకులు రాలిపోయినట్టు పోతున్నారన్నారు. మళ్ళీ చెట్టు చిగురిస్తుంది, కాయలు కాస్తుందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎండి పోయిన పొలాలు, కాలిపోతున్న మోటార్లు కనిపిస్తున్నాయని వినయ్ ఆరోపించారు. రాష్ట్రంలోని చోటా భాయ్, కేంద్రంలోని బడా భాయ్ కలిసి కేసీఆర్ మీద కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. తాను ఫుల్ టైం పొలిటీషియన్ అని తనకు ఎలాంటి వ్యాపారాలు లేవని చెప్పారు. పార్ట్ టైం పొలిటీషియన్‌లు పార్టీ మారినా వచ్చే నష్టం ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీవికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, బీఆర్ఎస్ ఎంపి అభ్యర్థి కడియం కావ్య, మాజీ రైతుబంధు కమిటీ అధ్యక్షురాలు లలిత యాదవ్, వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** జార్కండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు తెలంగాణ బాధ్యతలను అప్పగించారు. తెలంగాణతో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా ఆయనే బాధ్యతలు నిర్వర్తించనున్నారు. తమిళిసై రాజీనామా నేపథ్యంలో మంగళవారం రాష్ట్రప్రతి భవన్ ఈ విషయాన్ని వెల్లడించింది. తెలంగాణ గవర్నర్ తమిళిసై రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. పూర్తి స్థాయి గవర్నర్లను నియమించే వరకు తెలంగాణ, పుదుచ్చేరి బాధ్యతలను నిర్వర్తించాలని రాధాకృష్ణన్‌ను కోరుతూ రాష్ట్రపతి భవన్ ఓ లేఖ రిలీజ్ చేసింది. బాధ్యతలు స్వీకరించిన క్షణం నుంచి నియామకం అమలులోకి వస్తుందని రాష్ట్రపతి భవన్ పేర్కొంది.

# శానిటేషన్, నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

## బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలో శానిటేషన్, నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. మంగళవారం వరంగల్ లోని పోతన ట్రాన్స్ఫర్ స్టేషన్‌తో పాటు వరంగల్ నగర పరిధిలోని పలు ప్రాంతాలలో నీటి సరఫరా, సానిటేషన్ స్థితిగతులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోతన ట్రాన్స్ఫర్ స్టేషను పరిశీలించిన కమిషనర్ చెత్త తరలింపు విధానాన్ని, ప్లాంటు సామర్థ్యం, పనిచేసే విధానాన్ని ముఖ్య ఆరోగ్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరంగల్ బ్యాంక్ కాలనీ ప్రాంతంలో పర్యటించి స్థానికులను నీటి సరఫరా తీరుపై అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర సిఎంహెచ్ఓ డా.రాజేష్ ఈ ఈ శ్రీనివాస్ సానిటరీ సూపర్వైజర్ సాంబయ్య డిఈలు సారంగం రంగారావు కృష్ణమూర్తి రవీందర్ ఏఈలు సౌజన్య సతీష్ సానిటరీ ఇన్స్పెక్టర్లు శ్యామ్ రాజ్ ధరమ్ సింగ్ ఎల్లా స్వామి తదితరులు ఉన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com